# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | గురువారం 26-09-2024 | సంపుటి : 06 | సంచిక : 02 | పేజీలు : 8 | వెల : రూ 3-00


## ఎఆర్ డెయిరీ ఫుడ్ ప్రొడక్ట్స్పై చర్యలు తీసుకోండి

**కల్తీ నెయ్యి ఘటనపై పోలీసులుకు టిటిడి ఫిర్యాదు**

తిరుమల,సెప్టెంబర్25 : తిరుమల లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిన ఘటన సంచలనం కలిగించగా దానిపై టీటీడీ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తిరుపతి తూర్పు పోలీసు స్టేషన్‌లో ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రొడెక్ట్ లిమిటెడ్‌పై చర్యలు తీసుకోవాలని టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ జనరల్ మేనేజర్ మురళీకృష్ణ ఫిర్యాదు చేశారు. నిబంధనలు అతిక్రమించి కల్తీ నెయ్యి సరఫరా చేశారని ఆరోపించారు. ఈ యేడాది మే 15న నెయ్యి సప్లైకి ఆర్డర్స్ ఇవ్వగా , జూన్ 12, 20, 25 తేదీలతో పాటు జులై 6, 12న 4 ట్యాంకర్ల నెయ్యి ఏఆర్ డెయిరీ సరఫరా చేసిందని వివరించారు.

# బోటు కుట్రదారులను వదలబోం

**అనంతలో దేవుడి రథం కాల్చేశారు**
**ఎవరు తప్పుచేసినా తప్పించుకోలేరు**
**వరదసాయం అందచేసిన సిఎం చంద్రబాబు**



విజయవాడ,సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ): ప్రకాశం బ్యారేజీని ఢీకొన్న బోట్ల ఘటనలో ఖచ్చితంగా వైసీపీ కుట్ర ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బోట్లతో ప్రకాశం బ్యారేజీని ఢీకొట్టించారని మండిపడ్డారు. విజయవాడ కలెక్టరేట్‌లో వరద బాధితులకు నష్టపరిహారాన్ని సీఎం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... కనీస బాధ్యత లేకుండా ఆంబోతుల మాదిరి వ్యవహరించారంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అనంతపురంలో రథం కాల్చేశారన్నారు. బోట్ల విషయంలో కుట్ర పన్నిన వారిని అరెస్ట్ చేస్తామని స్పష్టం చేశారు. నేను అసమర్థుణ్ని కాను.. ఎవరు ఏం తప్పు చేసినా తెలిసేలా వ్యవస్థను ఎస్టాబ్లిష్ చేస్తున్నాం. ఎవరైనా కుట్రలు పన్నితే ఖబడ్దార్ అంటూ సీఎం చంద్రబాబు హెచ్చరించారు. వరద నష్ట పరిహారం కోసం 13వేల మంది అదనంగా దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు సాయం అందిస్తామన్నారు. అనర్హులు ఉంటే ఎందుకివ్వలేక పోయామో చెబుతామన్నారు. నేనిక్కడ బటన్ నొక్కడం లేదు.. బటన్ నొక్కి ఫూల్స్ చేయడం లేదు. నేరుగా బాధితుల ఖాతాలకే సాయం అందిస్తున్నాం. కుమ్మరిపాలెంలోని 38 వార్డులోకి నీరే రాలేదు.. ఇళ్లు మునగలేదు. కొందరు రెచ్చగొట్టి గొడవలు సృష్టించే ప్రయత్నం చేశారు. వరద సాయంలో ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించను. ఎవరైనా డబ్బులు తీసుకుంటే తిరిగి ఇచ్చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎన్డీఆర్ఎఫ్ గైడ్ లైన్స్ మించిన స్థాయిలో ఆర్థిక సాయం అందించామన్నారు. ఆర్థిక పరిస్థితి సహకరించకున్నా బాధితులకు సాయం అందిస్తున్నామని వెల్లడించారు. చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో ఆర్థిక ప్యాకేజీ ఇచ్చామన్నారు. అర్బన్ ప్రాంతాల్లో ఆర్థిక సాయం అనేది కేంద్రం నిబంధనల్లో లేదని.. కానీ బాధితులను ఆదుకోవడానికి ముందుకొచ్చామన్నారు. పంట నష్టాన్ని కూడా భారీగా పెంచామని.. సేవల్లో టెక్నాలజీని వినియోగించుకున్నామని తెలిపారు. నారాయణ, నిమ్మల రామానాయుడు, అనిత ఫీల్డులో బాగా పని చేశారని కొనియాడారు. సీనియర్ ఆఫీసర్ సిసోడియా కూడా బాగా పని చేశారన్నారు. సేవల విషయంలో ఎవ్వరూ ఊహించని విధంగా చేశామన్నారు. గృహోపకరణాలు రిపేర్లు చేయించామని.. వాహనాలకు బీమా ఇప్పించామన్నారు. గ్యాస్ స్టౌలు కూడా బాగు చేయించాం. చిన్న వ్యాపారస్తులకు సాయం అందించాం. లోన్లు రీ-షెడ్యూల్ చేయించాం. కొత్త లోన్లు ఇప్పించాం. సర్టిఫికెట్లని ఉచితంగా ఇప్పిస్తున్నాం. విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్ ఇప్పిస్తున్నాం అని సీఎం వెల్లడించారు. లైసెన్సుల్లేని కిరాణా షాపులకు కూడా సాయం అందించామన్నారు. భూయజమానులకు కాకుండా వ్యవసాయం చేసే కౌలు రైతులకే బాధితులకు పరిహారం ఇచ్చామన్నారు. అలాగే ఇంటి యజమానులు నష్టపోయి ఉంటే.. వారికి.. లేకుంటే అద్దెకున్న వాళ్లకి సాయం అందించామన్నారు. త్వరలో ఆపరేషన్ బుడమేరు ప్రారంభిస్తామని ప్రకటించారు. ఇంకా కేంద్రం సమావేశాలు పెట్టుకుని.. ఏపీకి చేయాల్సిన వరద సాయంపై చెబుతారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# వరద సమయంలో ఉద్యమస్ఫూర్తితో పనిచేశాం

**ప్రజల కష్టాల్లో అందరు ఒక్కటై పనిచేశారు**
**సిఎం సహాయనిధికి భారీగా చేయూత**
**400కోట్ల సాయం అందిందన్న సిఎం చంద్రబాబు**

విజయవాడ,సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ): వరద సమయంలో అందరం కలిసి ఉద్యమ స్ఫూర్తితో ముందు కెళ్లినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. విజయవాడలో వరద బాధితులకు ఆర్థిక సాయం అందజేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'పెద్ద విపత్తు కలిగినప్పుడు అందరం ఒక్కటై పనిచేయగలిగాం. ఒకవైపు వర్షపు నీరు వస్తుంటే.. మరోవైపు బుడమేరు నీరు పోటెత్తింది. అధికార యంత్రాంగంతో పాటు నేను స్వయంగా బురదలో దిగాను. తక్కువ సమయంలో విపత్తు నుంచి బయటపడగలిగాం. విరాళాల కోసం రాష్ట్రప్రజలంతా బ్రహ్మాండంగా స్పందించారు. వరద బాధితులకు సాయం చేద్దామని పిలుపునిస్తే అంతా ముందుకొచ్చారు. సీఎం సహాయనిధికి రూ.400 కోట్లు రావడం ఒక చరిత్ర. నాతో పాటు ఉద్యోగులంతా 11 రోజుల పాటు నిర్విరామంగా పనిచేశారు. వరద నీటిలో బాధితులకు అన్నిరకాల సాయం అందించే ప్రయత్నం చేశాం. బుడమేరుతో పాటు ప్రకాశం బ్యారేజీకి ఈస్థాయిలో



వరద ఎప్పుడూ రాలేదు. 11.90 లక్షల క్యూసెక్కుల గరిష్ఠ వరద సామర్థ్యం ఉంటే 11.47 లక్షల క్యూసెక్కుల వరదనీరు వచ్చింది. గత పాలకుల నిర్లక్ష్య వైఖరితో విజయవాడ వరద ముంపునకు కారణమైంది. కలెక్టర్ కార్యాలయంలోనే మకాం వేసి పరిస్థితి పర్యవేక్షించా. మొట్టమొదటిగా సింగ్ నగర్ వెళ్లి పరిస్థితి పరిశీలించి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడి బోట్లు, హెలికాప్టర్లు తెప్పించాం. పెద్ద సంఖ్యలో ఆహార పొట్లాలు, నీటి బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశాం. సహాయక చర్యల్లో 780 పొ÷-లకెయిన్లు పని చేశాయి. 75 వేల ఇళ్లను, 331 కిలోమీటర్ల మేర రహదారులను ÷ర్ ఇంజిన్లు శుభ్రపరిచాయి. మొత్తం వర్షాలు, వరదల కారణంగా 47 మంది మృతి చెందారు. ఇప్పటివరకు రూ.400 కోట్ల మేర సీఎం సహాయ నిధికి డబ్బులు వచ్చాయి. చిన్నా పెద్దా అందరూ స్పందించారు. సంఘటితంగా ఉంటే ఎలాంటి విపత్తు అయినా ఎదుర్కొంటాం. రూ.602 కోట్లు ఇప్పటివరకు బాధితులకు విడుదల చేశాం. ఇందులో రూ.400 కోట్లు దాతలు ఇచ్చినవే. మొత్తం నష్టం రూ.6,800 కోట్ల మేర జరిగింది. 16 జిల్లాలు ప్రభావితం అయ్యాయి. మొత్తం 4 లక్షల మందికి ఆర్థిక సాయం అందించాం. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కిరాణ దుకాణాలు, తోపుడు బండ్లకు సహాయం చేస్తున్నాం. నష్టపోయిన పంటలకు సాయం అందిస్తున్నాం. ఇళ్లు మునిగిన వారికి రూ.25 వేలు చొప్పున, మొదటి అంతస్తులో ఉన్న వారికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేశామని చంద్రబాబు తెలిపారు.

# చంద్రబాబు ముందస్తు చర్యలతో ప్రాణనష్టం జరగలేదు

**విజయవాడ వరదల్లో బాబు పనితీరు అద్భుతం**
**మోడీ, బాబులు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు**
**కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు**




శ్రీకాకుళం,సెప్టెంబర్25 :విజయవాడ వరదల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన సేవలు, తీసుకున్న చర్యలు అద్భుతంగా పని చేశాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. వరదలకు సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాల వల్లే పెద్దఎత్తున ప్రాణనష్టం తప్పిందన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా దీపావళి రోజు నుంచీ గ్యాస్ కనెక్షన్లు అందిస్తాం'అని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అభివృద్ధి పరుగులు పెడుతోందని రామ్మోహన్ నాయుడు అన్నారు. అటు ప్రధాని మోదీ, ఇటు సీఎం చంద్రబాబు ఇద్దరూ కలిసి ఏపీని అభివృద్ధి చేసేందుకు కంకణం కట్టుకున్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు. ఇప్పటికే రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్లు, పోలవరం మొదటి దశ పనుల కోసం రూ.12,567కోట్లు కేంద్రం ప్రకటించిందని ఆయన తెలిపారు. అలాగే రాష్ట్రానికి మూడు పారిశ్రామిక కారిడార్లు సహా ఇతర అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు మోదీ సర్కార్ అండగా ఉన్నట్లు రామ్మోహన్ నాయుడు చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ..' శ్రీకాకుళం జిల్లా నుంచి నాకు కేంద్ర మంత్రిగా అవకాశం వచ్చింది. ఈ ఐదేళ్లపాటు జిల్లా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. జిల్లాలో ఒక పోర్టు, ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తా. టెక్కలి మూలపేటలో సంవత్సరంలో పోర్టు పనులు పూర్తి చేస్తాం. నాకు కేంద్ర మంత్రిగా అవకాశం వస్తే.. బాబాయి కింజరాపు అచ్చెన్నాయుడుకి ఏపీ మంత్రిగా అవకాశం వచ్చింది. ఇద్దరం కలిసి జిల్లాని అభివృద్ధి చేస్తాం. శ్రీకాకుళం జిల్లా ప్రజల అభిమానం వల్లే మేము ఈ స్థాయికి వచ్చాం. ప్రతీ నెలా తెల్లవారుజామునే మీ ఇంటికి వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తు న్నాం. మాజీ సీఎం ఎన్టీఆర్ ఆనాడు మత్స్యకారులకు అనేక విధాలుగా సహాయం చేశారు. అదే విధంగా సీఎం చంద్రబాబు ముందుకు వచ్చారు. ప్రతీ ఒక్కరినీ ఆయన ఆదుకునేందుకు ముందుంటారు. త వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసింది.

# కల్తీ చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసారు

**కల్తీకి పాల్పడ్డ ఎవ్వరినీ ప్రభుత్వం వదలదు**
**మంత్రి సత్యకుమార్ ఘాటు హెచ్చరిక**

విజయవాడ,సెప్టెంబర్25 ): తిరుమల లడ్డూని కల్తీ చేసి వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీశారని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వేంకటేశ్వరస్వామి భక్తులు, ఏపీ ప్రజలు ఆయణ్ని క్షమించరని అన్నారు. లడ్డూ కల్తీ చేసి అపరాచానికి పాల్పడిన ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వారధి కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. 'జగన్ హయాంలో లడ్డూ తయారీ నాణ్యతలో వైసీపీ నేతలు రాజీపడ్డారు. కమీషన్లకు కక్కుర్తి పడి నేతి సరఫరాలో నిర్లక్ష్యం వహించారు. పవిత్రమైన ప్రసాదంలో కొవ్వు కలిపి



అపవిత్రం చేశారు. కల్తీ జరిగిందని ల్యాబ్ రిపోర్టుల ద్వారా నిర్ధారణ అయ్యింది. కోట్లాది మంది భక్తుల మనోభావాలను జగన్ దెబ్బతీశారు. టీటీడీ ఆస్తులు వేలం వేసేందుకు యత్నించారు. శ్రీవారి నిధులు దారి మళ్లించేందుకు కుట్రలు చేశారు. వాటి కన్నా ఇప్పుడు చేసిన నేరం అమానుషం. ఈ అపచారం చేసిన వ్యక్తులందరినీ కఠినంగా శిక్షించాలి. టీటీడీ బోర్డులో బీజేపీ నేతలు ఉన్నారని నింద మా పార్టీ నేతలకు ఆపాదించాలని జగన్ చూస్తున్నారు. టీటీడీ వ్యవహారాల్లో జగన్, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి తప్ప సభ్యులందరూ డమ్మీలే కదా. ఆ ముగ్గురూ నిర్ణయాలు తీసుకుని బోర్డు మీటింగ్‌ల పేరుతో ఆమోదించేవారు. జగన్ తాను చేసిన తప్పుల నుంచి దృష్టి మళ్లించేందుకు బీజేపీ నేతల పాత్ర ఉందని చెబుతున్నారు. సీఎంగా ఉండి టీటీడీలో జరిగే అపచారాలను ఆపే బాధ్యత నీకు లేదా జగన్?. ఏపీ మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి సిగ్గు లేకుండా వాగుతున్నారు. లడ్డూ ప్రసాదాన్ని పంది కొవ్వుతో పోలుస్తున్నాడు. అసలు ఏమైనా బుద్ది ఉందా?. వైసీపీ అధినేతకు టామాటా, పొటాటోకు కూడా తేడా తెలియదన్నారు. ఫ్యాన్ పార్టీ అధినేత ఐదు నిమిషాలు మాట్లాడేతే చాలు అతని డొల్లతనం బయటపడుతుంది. లడ్డూ కల్తీ పాపంలో ఎంతమందికి భాగస్వామ్యం ఉన్నా శిక్షించాల్సిందే. ఇప్పటికే సిట్ అధికారులు విచారణ ప్రారంభించారు.

# స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలి

**అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు అభిప్రాయాలు తెలియజేయండి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**





విభారే న్యూస్ కర్నూల్ ప్రతినిధిసెప్టెంబరు, 25 : స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని, తద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.బుధవారం కల్లూరు మండలం చెట్లమల్లాపురం గ్రామంలోని స్వచ్ఛతా హి సేవ, ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్రపఏ 2047 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామాలన్నింటిని పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో వ్యక్తిగతంగా పరిశుభ్రంగా ఉంచేందుకు ఒక నిర్దిష్టమైన స్థలాన్ని ఏర్పాటు చేసుకొని అక్కడే చెత్త వేసేలా చూడాలన్నారు. నిరుపయోగంగా ఉన్న చెత్తను క్లాప్ మిత్రల ద్వారా షెడ్ కు తరలించి రీసైక్లింగ్ చేయడం జరుగుతుందన్నారు.ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం 100 రోజుల్లో సాధించిన విజయాలను వివరిస్తూ కరపతం అందరికీ అందజేయడంతో పాటు స్టిక్కర్స్ ను ఇంటింటికీ అతికించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న పెన్షన్ దారులందరికీ ప్రతి నెల 1వ తేదిన పెన్షన్ అందజేయడం జరిగిందని, పెన్షన్ పంపిణీలో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలవడం జరిగిందన్నారు.స్వర్ణాంధ్రపఏ2047 కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాన్ని కలెక్టర్ వివరిస్తూ, భారత దేశానికి 1947వ సంవత్సరంలో స్వాతంత్రం రావడం జరిగిందని, 2047 నాటికి స్వాతంత్రం వచ్చి 100 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా, అప్పటికి మన గ్రామానికి/మండలానికి/జిల్లా అభివృద్ధి సమగ్రంగా సాధించేందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించుకుంటున్నాన్నారు.. సమగ్రమైన అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయడం ద్వారా 2047 నాటికి ప్రపంచ స్థాయిలో పోటీ తట్టుకునే విధంగా గ్లోబల్ సిటిజన్స్ గా మారే అవకాశం ఉందన్నారు.. స్వర్ణాంధ్రపఏ2047 విజన్ ప్లాన్ కు సంబంధించి ఫీడ్ బ్యాక్ ఫార్మ్ ఇవ్వడం జరిగిందని, అందులో ఉన్న క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే, 11 ప్రశ్నలు వస్తాయని, వాటి మీద తమ అభిప్రాయాలను తెలియజేయాలని కలెక్టర్ సూచించారు..తద్వారా రాష్ట్రం, గ్రామం, జిల్లా అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను తయారు చేసుకొని, వాటిని అమలు చేయడం జరుగుతుందన్నారు.. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం చాలా అవసరమని ప్రభుత్వం భావిస్తోందని అందుకనుగుణంగా ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములై అభిప్రాయాలు తెలియజేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అంతకుముందు "స్వచ్ఛతా హి సేవ" కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై గ్రామస్తులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.×అనంతరం గ్రామంలోని 9 మంది షెడ్ మిత్రా, క్లాప్ మిత్రాలకు జిల్లా కలెక్టర్ ఘనంగా సత్కరించారు..కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, గ్రామ సర్పంచ్ భూపాల్ రెడ్డి, ఎంపిపి శారద, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, డిపిఓ నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

గురువారం 26-09-2024

## మణిపూర్ మంటలు చల్లారేది ఎప్పుడు

ఈశాన్య ప్రాంతంలో వివిధ జాతుల గ్రూపుల మధ్య, అస్తిత్వ సంక్షోభం జాతుల మధ్య సంఘర్షణలు పెక్కింటికి దారి తీసింది. ఈశాన్య భారతంలో సంఘర్షణ పరిస్థితిని అర్థం చేసుకోవడం సంక్లిష్టమైన అంశం. ఆ ప్రాంత సాంఘిక, సాంస్కృతిక, చారిత్రక, జాతుల రూపురేఖల గురించి లోతైన అవగాహన కలిగి ఉండడం అవసరం. నాలుగు దేశాల అంతర్జాతీయ సరిహద్దులతో ఈశాన్య భారతం కీలకమైన, వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రాంతం. ఈశాన్య ప్రాంతంలోని రాష్ట్రాలు అన్నీ సాంస్కృతికంగా, భాషపరంగా, మతపరంగా భిన్నస్వభావం కలవి. భాష సంబంధిత అంతరంపరంగా విభిన్నతలు, మంగ్లాయిడ్, ఆస్ట్రలాయిడ్ జాతి మూలాలు, మతపరమైన బహుత్వం ఆ ప్రాంతాన్ని విలక్షణమైనదిగా చేశాయి. ఈశాన్య భారతంలో అసమ్మతికి ప్రధాన కారణాలు భాష సంబంధిత సాంస్కృతిక లొంగుబాటు భయం, ఆర్థికపరమైన అలక్షం, రాజకీయ శక్తుల వైఫల్యాలు. ఈశాన్యంలో అస్తిత్వ రాజకీయాలకు ప్రధాన కారణం జాతి ప్రజల విలక్షణ మనస్తత్వం. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక భావన కోల్పోతామేమోనన్న ఉద్దేశంతో ప్రత్యేక హక్కులు పొందాలనే మనస్తతం వారిది. తమ అస్తిత్వాన్ని చాటిచెప్పడానికి ఈశాన్యంలో పలు జాతి ఉద్యమాలు చోటుచేసుకున్నాయి. జాతుల మధ్య అశాంతి దేశానికి నేరుగా ఒక సవాల్. అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ జాతుల, సాంస్కృతిక, మతపర, భాషాపర వర్గాల సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. వివిధ ప్రభుత్వాలు ఈశాన్యంలో తిరుగుబాటు సమస్య పరిష్కారానికి విభిన్న విధానం అనుసరిస్తూ వచ్చాయి. మరొక గ్రూపును తుడిచిపెట్టేందుకు ఒక గ్రూపును ప్రోత్సహించడం, ప్రధాన స్రవంతిలోకి తిరిగి వచ్చేందుకు ప్యాకేజీలు అందజేయడం, ఒప్పందం కుదుర్చుకునేందుకు సంభాషణ కర్తలను నియోగించడం, తిరుగుబాటు నిరోధక సైనిక కార్యకలాపాలు మొదలైనవి ప్రభుత్వం తిరుగుబాటు సమస్య పరిష్కారానికి అనుసరించిన వ్యూహాలు. అయితే. ప్రభుత్వం అనుసరించిన ఆ విధానాలు ఫలితాలను ఇచ్చాయి. జయప్రదంగా ఒప్పందం కుదుర్చుకున్న తరువాత అనేక తిరుగుబాటు సంస్థలు లొంగిపోయాయి. ఆ ఒప్పందం కొత్త రాష్ట్రం, రాజ్యాంగం ఐదవ లేక ఆరవ షెడ్యూల్ కింద రాష్ట్రం పరిధిలోనే స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రాంతం ఏర్పాటుకు దారితీసింది. అయితే, ఈశాన్య ప్రాంతంలో తిరుగుబాటు ధోరణి విష వలయం నెమ్మదించడం లేదు. పూర్వపు గ్రూపులు ప్రధాన స్రవంతిలో కలసిపోయిన మరుక్షణం కొత్తగా తీవ్రవాద వర్గాలు ఆవిర్భవిస్తున్నాయి. బంగ్లాదేశ్ నుంచి రాష్ట్రంలోకి విదేశీ జాతీయుల చొరబాటుకు వ్యతిరేకంగా 1979లో మొదలై ఆరు సంవత్సరాలు సాగిన అస్సాం ఉద్యమం ఈశాన్య భారత చరిత్రలో సుదీర్ఘ సాంఘిక అశాంతుల్లో ఒకటిగా నిలిచింది. చారిత్రక అస్సాం ఒప్పందంపై సంతకాలు జరగడంతో ఆ ఉద్యమం 1985లో అంతమైంది. ఆ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, యువ నాయకులు పూర్వపు అసమ్ గణపరిషత్ (ఎజిపి) పేరిట ప్రాంతీయ పార్టీని ఏర్పాటు చేసిన తరువాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారు. అస్సాం ప్రజల కోసం స్వతంత్ర సార్వభౌమ దేశం ఏర్పాటు డిమాండ్‌తో 'అస్సాం సమైక్య విమోచన కూటమి (ఉల్ఫా) పేరిట అస్సాంలో బలమైన తిరుగుబాటు గ్రూప్ ఆవిర్భావానికి అస్సాం ఉద్యమం వీలు కల్పించింది. అగ్రశ్రేణి నాయకులు అనేక మంది తమ అనుచరులతో కలసి ప్రభుత్వానికి లొంగిపోయి ప్రధాన స్రవంతిలో కలిశారు. కానీ, ఒకింత బలహీనపడిన ప్రధాన గ్రూప్ మాత్రం తమ కమాండర్ ఇన్ చీఫ్ పరేష్ బారువా అలియాస్ పరేష్ అసమ్ నాయకత్వంలో ఇప్పటికీ క్రియాశీలకంగా ఉన్నది. 16 మాసాలుగా హింసాత్మక జాతి ఘర్షణలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మణిపూర్ ఇండియన్ యూనియన్‌లో చేరినప్పటి నుంచి పలు జాతుల ఘర్షణలు చూసింది. మణిపూర్‌లో వివిధ భౌగోళిక ప్రాంతాల్లో జనాభా పంపిణీ విలక్షణమైనది. ప్రధానమైన హిందువుల వర్గం మైతైలు మణిపూర్ జనాభాలో 53 శాతం ఉంటారు. కానీ వారికి రాష్ట్రంలోని లోయలో 10 శాతం మాత్రమే భూమి ఉన్నది. మరొక వైపు కుకీలు, నాగాలు చాలా వరకు పర్వత ప్రాంతాల్లో 90 శాతం స్థలాన్ని ఆక్రమించుకుని ఉన్నారు. వారిలో చాలా మంది క్రైస్తవులు. రాష్ట్ర జనాభాలో వారు 40 శాతం ఉంటారు. తాము అధిక సంఖ్యాకులు అయినందున మైతైలకే శాసనసభలో అధిక శాతం ప్రాతినిధ్యం ఉన్నది. అది మైతై ఆధిపత్య తత్వాన్ని ప్రోత్సహిస్తోంది. మెజారిటీ సమాజం చేతుల్లో అధికారం కేంద్రీకృతం కావడం, ప్రాంతీయ, పాలకవర్గ సమగ్రతకు ముప్పు భావన. జాతుల గ్రూపుల్లో వేర్వేరు మతపర అస్తిత్వం నమ్మకం లోటును సృష్టించింది. మైతై ఆధిపత్యవాద తత్వం మణిపూర్‌లో రాజకీయాలను, సామాజిక సంబంధాలను ప్రభావితం చేసింది. మైతై ముఖ్యమంత్రులు గడచిన 34 సంవత్సరాలుగా రాష్ట్రాన్ని పాలిస్తున్నారు. కుకీలు, నాగాల్లో పెరుగుతున్న అసమ్మతికి అది ఒక కారణంగా ఉన్నది. రాష్ట్ర బడ్జెట్, అభివృద్ధి పథకాల్లో అత్యధిక భాగం మైతై ఆధిక్యం గల ఇంఫాల్ లోయపైనే కేంద్రీకృతం అవుతున్నాయని మణిపూర్ మైనారిటీలు ఆరోపించారు. అధికారం, అభివృద్ధి పంపిణీలో అసమతుల్యం, జీవన ప్రదేశాల కోసం పోటీ మణిపూర్‌లో వివాదానికి ప్రధాన కారణం. గతంలో నాగాలు, కుకీ జోల మధ్య, నాగాలు, మైతైల మధ్య హింసాత్మక ఘర్షణల సందర్భాలు ఉన్నాయి. మైతైలు, పంగల్ (ముస్లిం) మైతైల మధ్య అంతర్గత వర్గ దౌర్జన్య సంఘటనలు కూడా 1993లో జరిగాయి. వాటిలో సుమారు 100 మంది మృతి చెందగా, అనేక మంది నిర్వాసితులయ్యారు. 1997 -98లో కుకి పైతే లేదా కుకి జోమి వివాదం వంటి అంతర్‌వర్గ ఘర్షణ కూడా జరిగింది. దానిలో 352 మంది మరణించారు. 13 వేల మందికి పైగా నిర్వాసితులయ్యారు. ఈశాన్యంలోని తిరుగుబాటు గ్రూపులు అన్నిటికీ విదేశీ శక్తుల ప్రాపకం ఉన్నది. తుపాకులు, మాదకద్రవ్యాల సరఫరా, ఆశ్రయం, విదేశీ భూభాగంలో శిక్షణ వంటివి ఆ శక్తులు సమకూరుస్తున్నాయి. తీవ్రవాద సంస్థలు ఒకటి లేదా అంతకు మించిన దేశాల నుంచి, ముఖ్యంగా మయన్మార్, బంగ్లాదేశ్, భూటాన్, చైనా నుంచి కార్యకలాపాలు సాగిస్తుంటాయి. నల్లమందు సేద్యం, లక్షిత జాతివర్గంపై దాడికి డ్రోన్ వినియోగం, మయన్మార్ నుంచి కుకి జో ప్రజలు పెద్ద ఎత్తున చొరబడడం వాస్తవంగా తీవ్ర వివాదంలో పైపై మెరుగు అంశమే. మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఆధిపత్యవాద పాత్ర, తీవ్రవాదుల గ్రూప్‌ను దాదాపుగా రాష్ట్రాన్ని పాలించేందుకు అనుమతించడం, మతపరంగా, జాతులపరంగా ప్రాబల్య వర్గాలను పోలీస్ స్టేషన్ల నుంచి ఆయుధాలను కైవసం చేసుకోనివ్వడం రాజధర్మం, మానవ హక్కుల ఉల్లంఘనే. కేంద్ర ప్రభుత్వ నిష్క్రియపరత్వం, మణిపూర్‌పై ప్రధాని దీర్ఘకాలిక మౌనముద్ర, బిజెపి ప్రభుత్వాల మతతత్వం, పాలనలో అసమర్థతను ప్రదర్శించాయి.

## గొర్రెల,మేకల పెంపకం దార్ల సంక్షేమం,వారి సమస్యలపై పోరాటానికి కట్టుబడి ఉంటాం...

- 12 డైరెక్టర్ లకు ఎన్నికల్లో పోటీ చేస్తాం..
- ఆంధ్రప్రదేశ్ గొర్రెల 6మేకల పెంపకం దార్ల సంఘం..



విభారె న్యూస్ ఎమ్మిగనూరు సెప్టెంబర్ 25..గొర్రెల మేకల పెంపకం దార్ల సంక్షేమానికి,సమస్యలపై పోరాటానికి ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం ముందుంటుందని ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కే మల్లేష్,అధ్యక్షులు కే రాముడు,జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా గొర్రెల మేకల పెంపకం దారుల జిల్లా చైర్మన్, వైస్ చైర్మన్ 12 డైరెక్టర్ల ఎన్నికల నోటిఫికేషన్ 26న విడుదల కానుందని, అక్టోబర్ 22న పోలింగ్ 12 డైరెక్టర్లు లలో జిల్లా చైర్మన్ వైస్ చైర్మన్ కూడా జరుగుతుందని ఈ ఎన్నికల్లో తమ సంఘం పోటీ చేస్తుందన్నారు. గతంలో ఎన్నుకున్న సంఘ సభ్యులు చైర్మన్ వైస్ చైర్మన్ లు గొర్రెల మేకల పెంపకం దారుల సంక్షేమాన్ని విస్మరించాలన్నారు. జిల్లాలో 24 లక్షల గొర్రెలు మేకలు ఉన్నాయని వీటిపై ఆధారపడి జీవించే పెంపకం దారుల సంక్షేమానికి పోరాడే వ్యక్తులు కావాలన్నారు. నేషనల్ క్రెడిట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ గొర్రెల మేకల పెంపకం దారుల సంక్షేమం కోసం ప్రతి సంవత్సరం 24 కోట్ల రూపాయలు జిల్లాకు విడుదల చేస్తుందన్నారు. గతంలో ఉన్న చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ ఉపయోగించు కోలేకపోయారని అన్నారు. కోటి రూపాయలు,50 లక్షలు,25 లక్షలు,ఐదు లక్షలు లక్ష రూపాయలు వరకు యూనిట్లను మంజూరు చేస్తుందని, గతంలో వీటిని వినియోగించు కోలేకపోయారన్నారు. ఈ పథకాలను లబ్ధిదారులకు చేర్చడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. అలాగే చనిపోయిన గొర్రెలు మేకలకు 6000 రూపాయలు చెల్లించాల్సి ఉందని గత ఐదేళ్లుగా ఒక పైసా కూడా చనిపోయిన జీవాలకు రాలేదన్నారు. గత ఐదు సంవత్సరాల్లో నష్టపోయిన వారికి కూడా లబ్ధి చేకూర్చాలని డిమాండ్ చేశారు. బెడ్ పాలక్ బీమా పాలసీ కింద గొర్రెల మేకల పెంపకం దారులు ఎనిమిది రూపాయలు చెల్లిస్తే నష్టపరిహారం వచ్చేదని అన్నారు. ఈ పాలసీని పునర్మింపచేయాలని, నాబార్డ్ కింద వచ్చే నిధు లను కూడా కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసిందని, పక్కన ఉన్న తెలంగాణలో నేషనల్ క్రెడిట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ 75% సబ్సిడీతో రుణాలు అందజేస్తుందన్నారు. గొర్రెల మేకల షెడ్లకు నిధులు కేటాయించాలని, అప్లికేషన్ల పేర్లతో పబ్బం గడప రాదన్నారు. అలాగే గొర్రెల సొసైటీల భూముల అన్యాక్రాంతం అరికట్టాలని,పశు గ్రాసం కోసం అసైన్డ్ బంజరు భూములు కేటాయించాలని, గొర్రెల మేకల మేత కోసం,నీరును అందించాలని,అలాగే గొర్రెల మేకలకు సంక్రమించే వ్యాధులు అరికట్ట డానికి మందులను ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 22 జరిగే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకం దార్ల సంఘం తరఫున పోటీ చేసి పెంపకం దారుల ప్రయోజనాలను కాపాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకం దార్ల సంఘం జిల్లా నాయకులు నాగరాజు, రైతు సంఘం నాయకులు అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సిడిపివో అధికారులు ఆధ్వర్యంలో బేటి బచావో - బేటి పడావో...





విభారె న్యూస్ సెప్టెంబర్ 25 ఎమ్మిగనూరు....బేటి బచావో బేటి పడావో పథకం ముఖ్య లక్షణం ఆడపిల్లల లింగ నిష్పత్తి లో తగ్గుదలను ఆపడము దేశంలో మహిళా స్థితిని మెరుగుపరచడానికి ఇది మహిళా సాధికారతను ప్రోత్సహిస్తుందని ఈ కార్యక్రమం స్త్రీలు, పిల్లల అభివృద్ధి, ఆరోగ్యము, కుటుంబ సంక్షేమము, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖలచే ప్రోత్సహిస్తూ ఉంది. బేటి బచావో బేటి పడావో చొరవకు రెండు ప్రధాన కారణాలు.. పిల్లల - లింగ నిష్పత్తి తక్కువగా ఉన్నందున ఈ పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం పిలుపునిచ్చిందని ఈ పథకము అన్ని భారతీయ రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలను అనుసరిస్తుందని, ఈ పథకము మూడు ప్రాథమిక లక్ష్యాలను కలిగే ఉందని 1.ఆడ శిశు హత్యలను అరికట్టాలి,2. ప్రతి ఆడబిడ్డకు భద్రత, రక్షణ ఉండేలా అభివృద్ధి చేస్తూ సహకారంతో పని చేయండిఅని,3.ప్రతిఆడపిల్లకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి స్త్రీలకు క్షుణ్ణంగా వివరించారు.. ముఖ్యంగా బాల్య వివాహాల గురించి బేటి బచావో బేటి పడావో పోషకాహారమాసోత్సవం గురించివివరించారు. ఐసిడిఎస్ జిల్లా అధికారులు, సూపర్వైజర్లు, సిడిపివో సఫరునీస, సూపర్వైజర్ రాధ, బసమ్మ, కృష్ణవేణి, పరిమళ, నాగలక్ష్మి, ఎస్ నూర్జహాన్, వెంకటేశ్వరమ్మ, ఆఫ్రిన్ తదితరులు గత రెండు రోజుల నుండి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 28న కాలినడకన తిరుమలకు జగన్

### ఆలయాల్లో పూజలకు వైసిపి పిలుపు

అమరావతి,సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ): వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఈనెల 28న తిరుమలకు కాలినడకన వెళ్లనున్నారు. లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు చేసిన ఆరోపణలతో తిరుమల ఆలయ పవిత్రతను, స్వామివారి ప్రసాదం విశిష్టతను మంటగలిపారని పేర్కొంటూ వైసీపీ ఆలయాల్లో పూజలకు పిలుపునిచ్చింది. ఈనెల 28న రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో పూజలు చేపట్టాలని వైఎస్ జగన్ ట్విట్టర్ వేదిక ద్వారా పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఆయన తిరుమల వేంకటేశ్వరస్వామి వద్దకు మెట్ల మార్గాన వెళ్లనున్నారు. తిరుమల లడ్డూ పవిత్రతను, స్వామివారి ప్రసాదం విశిష్టతను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు పాపాన్ని



ప్రక్షాళన చేసేందుకు వైసీపీ పూజలకు పిలుపునిచ్చింది. ఈ మేరకు వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం ఎక్స్ వేదిక ద్వారా వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వెంకటేశ్వరస్వామి వైభవాన్ని, టీటీడీ పేరు ప్రఖ్యాతులను, లడ్డూ పవిత్రతను, రాజకీయ దుర్బుద్ధితో, కావాలని అబద్ధాలాడుతున్నాని దుయ్యబట్టారు. జంతువుల కొవ్వుతో కల్తీ జరగనిది జరిగినట్టుగా, ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్టుగా, అసత్య ప్రచారంతో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు.

## 28 వతేదిన కౌన్సిల్ సమావేశం మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 25 :- మున్సిపల్ కౌన్సిల్ సదారణ సమావేశం 28 వతేదిన జరగనున్న నేపథ్యంలో ప్రదానఅజెండా సిద్ధమయిందని కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కమిషనర్ నిరంజన్ రెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతూ నంద్యాల అభివృద్ధికి తగు విధంగా అజెండాను పొందు పరచడంజరిగిందన్నారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులుకౌన్సిలర్లు అధికారులు హజరు కావాలని కోరారు. అజెండా పత్రాలను ప్రజాప్రతినిధులకు కౌన్సిలర్లకు పంపించామని తెలిపారు.

## స్వభావ స్వచ్ఛత సంస్కార్లో భాగంగా వాహనాలకు ఆయిల్ చేంజ్...




విభారె న్యూస్ సెప్టెంబర్ 25 ఎమ్మిగనూరు..స్వచ్ఛత హి సేవ కార్యక్రమం లో భాగంగా ఈనెల 17 నుండి అక్టోబర్ 2 వరకు జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మిగనూరు పట్టణంలో మునిసిపల్ కమిషనర్ ఎన్ గంగిరెడ్డి ఆదేశాల మేరకు డి.ఈ.ఈ. నీరజ,శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వభావ స్వచ్ఛత - సంస్కార్ లో భాగంగా చెత్త సేకరించే వాహనాలకు ఆయిల్ చేంజ్ చేయించడం,సర్వీస్ సింగ్ చేయించడం జరిగింది ఈ కార్యక్రమంలో శానిటరీ,పర్యావరణ సెక్రటరీలు పాల్గొనడం జరిగింది.

## మహానంది లో ఉచిత వైద్య శిబిరం




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 25 - గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛ భారత్ మిషన్ స్వచ్ఛత హి సేవ కార్యక్రమములోభాగంగామహానంది నందు ఆలయం సుపద మండపాల వద్ద తిమ్మాపురం పి హెచ్ సీ వారు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి దేవస్థానము నందు పనిచేయు చున్న శానిటేషన్ వర్కర్లకు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, రెగ్యులర్ సిబ్బందికి 33 రకముల రక్త పరీక్షలు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో డాక్టర్ భగవాన్ దాస్, హుస్సేన్ రెడ్డి, , అమీనాబి, , ల్యాబ్ టెక్నీషియన్ సిఖిందర్, హేమలత. సునీత మరియు దేవస్థాన అధికారులు వై. మధు, ఎఈఓలు అధికారులు పాల్గొన్నారు.

## రాజకీయా లబ్ధ ఇకోసమే కల్తీ ప్రచారం

### సిఎం చంద్రబాబుపై మండిపడ్డ పేర్ని నాని, కొడాలినాని

అమరావతి,సెప్టెంబర్25 తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని మాజీ మంత్రులు, వైసీపీ నాయకులు పేర్ని నాని, కొడాలి నాని ఆరోపించారు. రాజకీయ లబ్ధి పొందాలనుకుంటే ఆ వేంకటేశ్వరస్వామి చంద్రబాబును క్షమించడని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా కొడాలి నాని తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గత టీడీపీ , వైసీపీ పాలనలో తిరుమలకు సరఫరా అయిన నెయ్యిలో కల్తీ ఉందని నెయ్యి ట్యాంకర్లను వెనక్కు పంపిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే శ్రీవారి ప్రతిష్టను మంటగలిపేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. లడ్డూపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కల్తీ నెయ్యిని ఎప్పుడూ తిరుమలలో వాడలేదని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధికోసమే జంతువుల కొవ్వు ప్రస్తావన తీసుకొచ్చారని వారు విమర్శించారు. జంతువుల నూనె కలిసిందని ఎవరూ నివేదిక ఇవ్వలేదని తెలిపారు. తిరుమలలో చంద్రబాబు ఎన్నిసార్లు తలనీలాలు సమర్పించారని, ఎన్నిసార్లు కాలినడకన స్వామివారిని దర్శించుకున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు అసలు వేంకటేశ్వరాస్వామి భక్తుడు కాదని ఆరోపించారు. టీడీపీ నాయకులు బరితెగించి వైసీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు.

# లైవ్ లో లడ్డూ వివాదం...




విజయవాడ, సెప్టెంబర్ 25, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొత్త స్ట్రాటజీకి తెరతీశారు. జగన్ అక్రమాస్తులపై ఎంత విమర్శలు చేసినా ఫలితం లేదు. అవి న్యాయస్థానాల్లో ఏళ్లుగా నలుగుతూనే ఉన్నాయి. మరోవైపు జనం కూడా నమ్మడం లేదు. అవినీతి అంటే ప్రజలు కూడా సాధారణంగానే చూడటం పరిపాటిగా మారింది. ఈ విషయాన్ని చంద్రబాబు పసిగట్టినట్లుంది. అందుకే చంద్రబాబు ఇప్పుడు హిందువల సెంటిమెంట్‌ను బలంగా జనంలోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. కమలం పార్టీ దేశ వ్యాప్తంగా విస్తరించింది ఈ కోణంలోనే. అదే వ్యూహాన్ని చంద్రబాబు నాయుడు ఇప్పుడు రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు కనపడుతుంది. దీంతో వైఎస్ జగన్ ఇక రాజకీయంగా కోలుకోలేరన్నది విశ్లేషకుల అంచనా. ఎందుకంటే తిరుమల లడ్డూ వివాదాన్ని వదిలిపెట్టకుండా ఆయన దాని వెంట పడుతున్నారు. ఒకటి కాదు రెండు కాదు.. తిరుమల, సింహాచలం, అన్నవరం ఇలా అన్ని దేవాలయాల్లో సంప్రోక్షణ జరిపి గత ప్రభుత్వంలో అరాచకాలు జరిగాయని, తప్పులు జరిగాయనే భావన ప్రజల్లోకి చొప్పించే ప్రయత్నం చేస్తున్నారు. సెంటిమెంట్‌తో జనాలను సులువుగా లాక్ చేయవచ్చు. అలాగే భక్తితో కూడా ప్రజలను సులువుగా ఒకరిపై ద్వేషం తెప్పించవచ్చు. మరొకరిపై ప్రేమను కూడా కురపించవచ్చు. జాతీయ స్థాయిలో హిందువుల మనోభావాలంటూ బీజేపీ ఎలా ఎదిగిందో.. ఆంధ్రప్రదేశ్ లో జగన్ ను క్షేత్రస్థాయిలో దెబ్బతీయాలంటే ఆలయాలే ప్రధానమన్న నిర్ణయానికి చంద్రబాబు వచ్చినట్లు కనపడుతుంది. అందుకే తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీ విధానాన్ని పెద్దది చేశారు. రచ్చ రచ్చ చేస్తున్నారు. స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీం వేశారు. తిరుమల ఆలయంలో అపవిత్రతత జరిగిపోయిందన్న కలరింగ్ బాగానే ఇచ్చారు. దీనికి మిత్రపక్షమైన పవన్ కల్యాణ? కూడా సహకరిస్తున్నారు. మరో మిత్ర పక్షం బీజేపీ పెద్దగా స్పందించకపోయినా పవన్ కల్యాణ్ మాత్రం

### పక్కా ప్లాన్ తో ఎన్డీయే కూటమి

ప్రాయశ్చిత్త దీక్ష పేరుతో రోజూ ఏదో ఒక కార్యక్రమం చేస్తూ ఈ లడ్డూ వివాదం లైవ్ లో ఉండేలా చూస్తూ చంద్రబాబుకు నేరుగా సహకరిస్తున్నారు. దుర్గగుడి మెట్లను శుభ్రం చేయడమే కాకుండా వైసీపీ నేతలకు దుర్గగుడి నుంచే వార్నింగ్ ఇచ్చారు. ఇలా ఇటు చంద్రబాబు, అటు పవన్ కల్యాణ్‌లు మాత్రం వైసీపీని రాజకీయంగా వెనక్కు నెట్టే ప్రయత్నం బాగానే చేస్తున్నట్లు కనపడుతుందిమరోవైపు చంద్రబాబు ఎక్స్ లో కూడా కొద్ది సేపటి క్రితం చేసిన ట్వీట్ కూడా జగన్ ను ఇరకాటంలోకి నెట్టేది లా ఉంది. తిరుమలకు వెళ్లిన జగన్ ఎందుకు డిక్లరేషన్ ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇతర మతస్థులు తిరుమలకు వెళ్లవచ్చని, వారు వెళితే స్వామివారిని దర్శించుకునే సమయంలో డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందన్న సంగతి జగన్కు తెలియదా? అని చంద్రబాబు జగన్ నిలదీశారు. సంప్రదాయాన్ని జగన్ తుంగలో కుక్కి జగన్ తిరుమల పవిత్రను కాలరాశారంటూ చంద్రబాబు మండిపడ్డారు. సంప్రదాయాలను గౌరవించకపోతే తిరుమల ఎందుకు వెళ్లాలని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక దేవాలయాల్లో జరిగిన ఘటనల పట్ల కూడా జగన్ నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ చంద్రబాబు ఫైర్ అయ్యారు. మొత్తం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు కలసి జగన్ ను కోలుకోకుండా చేసేందుకు గట్టి ప్రయత్నాలే చేస్తున్నట్లు కనపడుతుంది.మాజీ మంత్రి రోజాకు నెటిజన్లు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. ఆమె తిరుమల గురించి పెట్టిన రెండు పోల్స్ కు నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో వెంటనే వాటిని డిలీట్ చేశారు. ప్రస్తుతం నెటిజన్లు ఆమె డిలీట్ చేసిన పోల్స్ స్క్రీన్ షాట్స్ తీసి రోజాను ఆటాడేసుకుంటున్నారు. జగన్ పరువును మీరే తీస్తున్నారంటూ తిట్టిపోస్తున్నారు.వైఎస్ జగన్ ప్రభుత్వం మంత్రిగా పని చేసిన రోజా.. తాజా ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయారు. ఆ తర్వాత రోజా జనాలకు కనిపించకుండా పోయారు. గత కొంతకాలంగా చెన్నైలోనే గడుపుతున్నారు. తరచుగా ఆమె ఏపీకి వచ్చి వెళ్తున్నారు. గత కొద్ది రోజులుగా తిరుమల లడ్డూ వివాదం చెలరేగడంతో ఆమె స్పందించారు. గత ప్రభుత్వ పెద్దలు తిరుమల లడ్డును అపవిత్రం చేశారనే చర్చ రోజుగా సాగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియాలో ఆమె రెండు పోల్స్ పెట్టారు. తొలుత తిరుమలలో ఎవరి పాలన బాగుంది? అంటూ పోల్ పెట్టారు. 24 గంటల్లో ఆ పోస్టుకు ఏకంగా 19 వేల మంది ఓట్లు వేశారు. ఆశ్చర్యకరంగా ఈ పోల్ లో 76 శాతం మంది చంద్రబాబు నాయుడు పాలన బాగుందని ఓట్ చేయగా, 24 శాతం మంది జగన్ పాలన బాగుందని ఓట్ చేశారు. ఊహించని విధంగా జగన్ కు వ్యతిరేకంగా నెటిజన్ల ఓటింగ్ రావడంతో రోజా షాక్ అయ్యారు. వెంటనే ఆ పోల్ ను డిలీట్ చేశారు.తొలి పోల్ కు నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో రోజా మరో పోల్ పెట్టారు. తిరుమల లడ్డు ప్రసాదం కల్తీ వ్యవహారంలో తప్పు ఎవరిది? అని పోల్ పెట్టారు. ఆప్షన్స్ గా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మాజీ సీఎం జగన్ అనే ఆప్షన్స్ ఇచ్చారు.

ఈ పోల్ కు సైతం 24 గంటల్లో 62 వేలకు పైగా నెటిజన్లు ఓటింగ్ లో పాల్గొన్నారు. ఇందులో 72 శాతం మంది నెటిజన్లు మాజీ సీఎం జగన్ వల్లే తిరుమల లడ్డూ కల్తీ జరిగిందని ఓట్ చేశారు. 21 శాతం మంది చంద్రబాబు అంటూ ఓట్ చేశారు. మరో 7 శాతం మంది పవన్ కల్యాణ్ వల్ల లడ్డూ కల్తీ జరిగిందని ఓట్ చేశారు. రెండో పోల్ లోనూ నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో మళ్లీ షాక్ అయ్యారు. వెంటనే ఈపోల్ ను కూడా రోజా డిలీట్ చేశారు. అంతేకాదు, పోల్ ఛానెల్ ను కూడా ఆమె డిలీట్ చేశారు.తిరుమలపై రోజా పెట్టిన రెండు పోల్స్ డిలీట్ చేయడంతో నెటిజన్లు ఆమెను తీవ్రంగా ట్రోల్ చేస్తున్నారు. ఆమె పోల్స్ కు సంబంధించిన స్క్రీన్ షాట్ల తీసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. రోజాపై ఓ రేంజిలో సటైర్లు వస్తున్నారు.

## జంతుల కొవ్వుతో కల్తీని ఎలా చేస్తారు

నెల్లూరు, సెప్టెంబర్ 25, భక్తులు ఎంతో పవిత్రంగా భావించే ప్రసాదం తిరుమల లడ్డు. అందులో నుంచి చిన్న ముక్క నేలపై పడితేనే ఎంతో అపచారంగా భావిస్తారు. అలాంటిది ఆ లడ్డూలో జంతువుల కొవ్వుతో చేసిన నెయ్యి కలిసిందని తెలిస్తే? అది భక్తులను ఎంతగా కలిచివేస్తుందనేది మాటల్లో వర్ణించలేం. తెలిసి చేసినా తెలియక చేసిన తప్పు తప్పే. దేవుడి ప్రసాదాన్నే కల్తీ చేసిన కేటుగాళ్లు.. మనం కొనుగోలు చేసే నూనెలను కల్తీ చేయకుండా ఉంటారా అనే సందేహం ప్రతి ఒక్కరినీ వెంటాడుతోంది. కొందరు మాత్రం.. నెయ్యి కంటే పంది కొవ్వే ఖరీదైనది, అలా కలిసే ఛాన్సే లేదంటూ తలాతోక లేకుండా మాట్లాడుతున్నారు. అలాంటి కల్తీ నూనెల తయారీకి వాడే జంతువులను అప్పటికప్పుడు వధించి తయారు చేస్తారని అనుకుంటే పొరపాటే. అసలు నిజం తెలిస్తే.. మైండ్ బ్లాక్ అవుతుంది.ఈ రోజుల్లో ఏది అసలు.. ఏది నకిలీ అని గుర్తించడం కష్టమే. ఇప్పుడు మార్కెట్లో లభ్యమవుతున్న నెయ్యి, నూనెలను చెక్ చేసినా.. షాకింగ్ రిపోర్టులు రావచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందేందుకు కొన్ని సంస్థలు అడ్డదారులు తొక్కుతున్నాయి. చీప్‌గా వచ్చే జంతువుల కొవ్వులను నూనెల్లో కలుపుతున్నారు. అదేంటీ.. మార్కెట్లో, మటన్, బీఫ్‌లు అంతేసి ఖరీదు ఉంటాయి. అలాంటిది.. వాటి కళేబరాలతో తయారు చేసే నూనెలు కూడా అంతే ఖరీదు ఉండాలి కదా అని కొందరు లాజిక్కులు చెప్పినా నమ్మకండి. ఎందుకంటే.. ఆ నూనెల తయారీకి ఎక్కువ శాతం వాడేది బయట అనాథగా చచ్చిపోయే వివిధ జంతువుల మాంసాన్ని. నెయ్యి లేదా నూనెల్లో పంది కొవ్వు అవశేషాలు ఉన్నాయంటే.. తప్పకుండా అవి చనిపోయిన వాటి నుంచి తీసిందే కావచ్చు. ప్రత్యేకంగా వాటిని పెంచి, వధించి నూనెలు తయారు చేసే ఛాన్సే ఉండదు.చాలామంది జబ్బు పడిన లేదా ఒట్టిపోయిన (పాలు ఇవ్వలేని) ఆవులు, గేదెలను తక్కువ రేటుకు విక్రయిస్తుంటారు. మరికొందరు రోడ్డు ప్రమాదాలు, లేదా జబ్బులతో చనిపోయే జంతువుల కళేబరాలను సేకరిస్తుంటారు. వాటిని ఇలాంటి నూనెల తయారీ సంస్థలకు విక్రయిస్తారు. వారు ఆ కళేబరాలను ముక్కలుగా చేస్తారు. తర్వాత అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద వాటిని మరిగిస్తారు. ఆ వేడికి మాంసానికి ఉండే కొవ్వు మొత్తం నూనెలా తయారవుతుంది. దాన్ని ప్రత్యేక పాత్రల్లోకి తీసుకుని, శుద్ధి చేసి.. స్మెల్ రాకుండా రసాయనాలతో ప్రొసెస్ చేస్తారు. పూర్తిగా అవి నూనె తరహా రంగును పొందిన తర్వాత.. ప్యాకెట్లు, టిన్నుల్లో వేసి విక్రయిస్తారు. కొన్ని సంస్థలు బ్రాండెడ్ సంస్థల స్టిక్కర్లు వేసి మరీ విక్రయిస్తాయి. ఇలాంటి సంస్థలు దేశవ్యాప్తంగా చాలానే ఉన్నాయి. అయితే, ఇదంతా గుట్టుచప్పుడుగా సాగిపోయే ప్రక్రియ. అవన్నీ బయటకు సాధారణ నూనె కర్మాగారాలుగా కనిపిస్తాయి. కానీ లోపల జరిగేది మాత్రం ఇది.వాస్తవానికి నెయ్యి తయారి చాలా పెద్ద ప్రాసెస్. పాల ఉత్పత్తుల ధరలు ఇటీవల బాగా పెరిగాయి. పాడి రైతుల నుంచి పాలను సేకరించి.. వాటి ద్వారా స్వచ్ఛమైన నేతిని తయారు చెయ్యాలి. ఇది ఖరీదైన ప్రాసెస్. అందుకే, నెయ్యి ధరలు ఆ స్థాయిలో ఉంటాయి. అయితే, భారీ స్థాయిలో నెయ్యి సప్లయ్ చేసేందుకు కొన్ని సంస్థలు నాణ్యత విషయంలో రాజీపడతాయి. నేతిలో చవకగా లభించే కొవ్వులను కలిపి మాయ చేస్తాయి. ఉదాహరణకు ఒక లీటర్ నెయ్యిలో సుమారు 50 గ్రాముల జంతుకొవ్వుల నూనె కలిపినా.. భారీగా సేవ్ చేయొచ్చు. మనలాంటి సాధారణ ప్రజలు వాటిని గుర్తించలేరు. ల్యాబ్స్‌లో కూడా వివిధ దశల్లో పరీక్షలు చేస్తేనే.. తెలుస్తుంది. అందుకే కేటుగాళ్ల ఆటలు సాగుతున్నాయి. సుమారు నాలుగేళ్ల కిందట హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో ఇలాంటి కర్మాగారాన్ని ఒకటి గుర్తించారు. అక్కడ వందలాది జంతు కళేబరాలతో నూనెను తయారు చేస్తున్నట్లు తెలుసుకుని అధికారులు షాకయ్యారు. ఆ కర్మాగారం నుంచి తీవ్రమైన దుర్గంధం వస్తుందని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ విషయం బయటపడిందిఇలాంటి నకిలీలను గుర్తించడం కొంచెం కష్టమే. అయితే, ఆహార నిపుణులు తెలిసిన వివరాల ప్రకారం.. స్వచ్ఛమైన నూనెలను మరిగిస్తే పొంగు రాదు. జంతువుల కళేబరాలతో తయారు చేసిన నూనెలను మరిగిస్తే మాత్రం పొంగు వస్తుంది. అంతేకాదు.. దుర్వాసన కూడా వస్తుంది.

## నందా వర్సెస్ బద్రి....




విజయవాడ, సెప్టెంబర్ 25, అత్యంత పవిత్రంగా భావించే తిరుమల లడ్డు కల్తీ వ్యవహారం దేశ వ్యాప్తంగా ప్రకంపనలు రేపుతోంది. హిందూ ధార్మిక సంఘాల నుంచి రాజకీయ నాయకుల వరకు ఈ వ్యవహారంపై మండిపడుతున్నారు. ఏపీలో రాజకీయంగా అట్టుడుకుతోంది. టీడీపీ, వైసీపీ నేతలు ఈపాపం మీదంటే మీదేనంటూ విమర్శలు గుప్పించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓ అడుగు ముందుకేసి ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా బెజవాడ కనకదుర్గమ్మ ఆలయంలో శుద్ధి కార్యక్రమం చేశారు పవన్ కల్యాణ్. ఈ క్రమంలో వైసీపీ నేతలపైనా, సినీ ప్రముఖులపైనా విమర్శలు గుప్పించారు.నెయ్యి కల్తీపై వైసీపీ నాయకులను తీవ్రంగా విమర్శించన పవన్ కల్యాణ్.. అనంతరం పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, ప్రకాశ్‌రాజ్‌తో పాటు, సినిమా యాక్టర్లపై ఓ రేంజ్‌లో విరుచుకుపడ్డారు. ఈ ఇష్యూలో మొదట పవన్ కల్యాణ్ చేసిన ట్వీట్‌కి ప్రకాశ్ రాజ్ కౌంటర్ ఇచ్చారు. ప్రియమైన పవన్ కల్యాణ్, మీరు డిప్యూటీ సీఎంగా ఉన్న రాష్ట్రంలోనే ఈ ఘటన జరిగింది. నిందితులను కనిపెట్టి కఠిన చర్యలు తీసుకోండి. అంతేకానీ, లేనిపోని భయాలను వ్యాప్తి చేస్తూ జాతీయ స్థాయి సమస్యగా ఎందుకు మారుస్తున్నారు. ఇప్పటికే దేశంలో మతపరమైన ఆందోళనలు ఉన్నాయి అంటూ రెండు రోజుల క్రితం ట్వీట్ చేశారు. ఈ ఎక్స్ వార్‌లో వెంటనే మంచు విష్ణు ఎంటరయ్యారు. పవన్‌కి సపోర్ట్ చేస్తూనే.. ప్రకాశ్ రాజ్‌కి మీ పరిధిలో మీరు ఉండాలంటూ సున్నితంగా వార్న్ చేశారు. మరోవైపు తిరుమల లడ్డూ విషయంలో దేశ వ్యాప్తంగా చర్చ కొనసాగుతునే వచ్చింది.ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా విజయవాడ దుర్గ గుడి మెట్లు కడిగిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. ఆ సమయంలో ఒకరిద్దరికి కాదు? ప్రకాశ్ రాజ్, సినీ హీరో కార్తీ, సోమవారం ఢిల్లీలో మాట్లాడిన పొన్నవోలు.. ఇలా అందరికీ వరుస పెట్టి వాయించేశారు. తాను హిందువుల విషయం గురించి మాట్లాడితే ప్రకాష్‌రాజ్ అభ్యంతరం ఏమిటని, ఏ మతాన్ని తాను నిందించలేదని, దీనిని కూడా తాను గోల చేస్తున్నానని అనడం ఏమిటని ప్రశ్నించారు. ముస్లింలు, మదర్సాల మీద తనకు ఎప్పుడూ గౌరవం ఉందని, వాటికి లక్షల కొద్ది విరాళాలు ఇచ్చానని గుర్తు చేశారు. మిషనరీ స్కూల్లోనే చదువుకున్నానని, వారి మీద తనకు ఎప్పుడు గౌరవం ఉంటుందన్నారు. తనను తాను తగ్గించకున్న వాడు హెచ్చింపబడతారనే దానిని నమ్ముతానని, అయితే నేను పాటించే ధర్మానికి అన్యాయం జరిగితే తాను మాట్లాడటంలో తప్పేమిటన్నారు. ప్రకాష్ రాజ్ ఇవి తెలుసుకోవాలన్నారు.అయితే పవన్ రియాక్షన్‌పై తాజాగా రియాక్టయ్యారు ప్రకాశ్ రాజ్. తన వ్యాఖ్యలను పవన్ అపార్థం చేసుకున్నారని ఎక్స్ ప్లాట్ ఫాం వేదికగా వివరించారు. తాను ఒకటి చెబితే పవన్ మరోలా అర్థం చేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం విదేశాల్లో షూటింగ్‌లో ఉన్నానని, ఈ నెల 30 తర్వాత ఇండియాకు వచ్చి అన్నింటికీ సమాధానం చెబుతానని అన్నారు. వీలైతే తన ట్వీట్‌ని మరోసారి చదివి అర్థం చేసుకోవాలని కోరారు.మరోవైపు ఫిల్మ్ ఇండస్ట్రీకి కూడా స్వీట్ వార్నింగ్ ఇచ్చారు పవన్‌కల్యాణ్. హీరో కార్తీ సత్యం సుందరం మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ సోమవారం జరిగింది. వేడుకలో యాంకర్ కార్తీతో మాట్లాడుతూ.. లడ్డూ కావాలా నాయునా అని అడిగారు. అందుకు కార్తీ స్పందిస్తూ.. లడ్డూ టాపిక్ వద్దని.. ఇప్పుడు ఆ అంశం సెన్సిటివ్ టాపిక్ అని కామెంట్ చేశారు. లడ్డూ గురించి హీరో కార్తీ సెటైర్లు వేశారు. కార్తీ చేసిన వ్యాఖ్యలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. సినిమా ఫంక్షన్లలో హిందూ ధర్మాన్ని కించపర్చొద్దని సూచించారు. సనాతన ధర్మ పరిరక్షణలో సినిమావాళ్లకు బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. హిందువుల మనోభావాలపై జోకులు వేయడం మానుకోవాలని అన్నారు. అభిమానులు కూడా హిందూ ధర్మ పరిరక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు .పవన్ వ్యాఖ్యల తర్వాత సినీ హీరో కార్తి వివరణ ఇచ్చారు. పవన్ కల్యాణ్ అంటే నాకు అమితమైన గౌరవం ఉందన్నారు. అనుకోని అపార్థానికి క్షమాపణలు కోరుతున్నా అన్నారాయన. తిరుమల శ్రీవారి భక్తుడిగా సంప్రదాయాలకు కట్టుబడి ఉంటానని హీరో కార్తి చెప్పారు.అయితే మెగా ఫ్యామిలీకి అత్యంత ఆప్తుడిగా, విధేయుడిగా ముద్రపడ్డ ప్రకాశ్‌రాజ్‌పై ఈ రేంజ్‌లో పవన్ కల్యాణ్ ఫైర్ కావడం టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. సినిమా రిలేషన్స్ వేరు.. రాజకీయాలు వేరు అని పవన్ నిరూపించదల్చుకున్నారా అనే టాక్ వినిపిస్తోంది. సినిమా, రాజకీయాలన్నింటికన్నా సనాతన ధర్మం గొప్పదని హిందూ సమాజంలో తనదైన ముద్రను వేసుకోవాలని ప్రయత్ని స్తున్నారా అనే చర్చ మొదలైంది.

## వ్యూహాత్మక తప్పిదాలతో వైసీపీ



విజయవాడ, సెప్టెంబర్ 25, రాజకీయాల్లో ఎప్పుడూ తప్పించుకునేందుకు ఓ దారిని పార్టీలు సిద్ధంగా ఉంచుకుంటాయి. అడ్డంగా దొరికిపోవాలని ఎవరూ అనుకోరు. అందుకే ఏదైనా సమస్య వస్తే తమ మాటాల్ని వక్రీకరించారనో తప్పుగా అర్థం చేసుకున్నారనో చెప్పి సర్దుకుంటారు. కానీ ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో కలకలం రేపుతున్న లడ్డూ నెయ్యి కల్తీ అంశంలో వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్ మొత్తం వ్యవహారాన్ని తన పార్టీకి అంటించుకునే విషయంలో అత్యుత్సాహం ప్రదర్సించారు. తెలుగుదేశం పార్టీ, జనసేన జరిగిన తప్పును వైసీపీ, జగన్ తప్పు అని చెప్పడానికి ప్రయత్నించడం సహజం. అలాంటి సమయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సిన వైసీపీ, జగన్ పూర్తిగా దానికి బాధ్యత వహిస్తూ.. తెరపైకి వచ్చారు. తప్పేమీ జరగలేదని వాదిస్తూ పోతున్నారు. దీని వల్ల మంచి కంటే చెడు ఎక్కువ జరుగుతోంది. తప్పు జరిగిందని నమ్మేవాళ్లంతా.. వైసీపీ, జగన్ వల్లే అనుకునే పరిస్థితి వచ్చేసింది. కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో చంద్రబాబు కల్తీ నెయ్యి గురించి ప్రస్తావించారు. ఖచ్చితంగా ఆ అంశం సంచలనం సృష్టిస్తుంది. వైసీపీ, జగన్‌పై ఉన్న అన్యమత ముద్ర కారణంగా ఇది మరింత సంచలనం అవుతుంది. అలాంటి సమయంలో ఏ పార్టీ అయినా ఆ విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. సవాళ్లు, ప్రతి సవాళ్లు కాకుండా.. నిరూపంచాలని సవాల్ చేయాలి. అది కూడా.. ఈ వాదన అంతా.. టీటీడీలో బాధ్యులుగా ఉన్న వారినే ముందుగా పెట్టి నడిపించారు. వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, ధర్మారెడ్డిలతో వివరణ ఇప్పిస్తే సరిపోయేది. కానీ నేరుగా జగన్ వచ్చి.. అసలు కల్తీ జరగలేదని చెప్పడం ద్వారా.. మొత్తం జరిగిన వ్యవహారం అంతా జగన్, వైసీపీ కనుసన్నల్లోనే జరిగిందన్న భావనకు జనం వచ్చేశారు. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. టీటీడీ స్వతంత్ర బోర్డు. అందులో సందేహమే లేదు. కానీ ప్రభుత్వ కనుసన్నల్లో నడుస్తుంది. కానీ సీఎం అయినా మరెవరు అయినా రోజువారీ వ్యవహారాలను చూడరు. నెయ్యి కొనుగోలు అంశంలో ఏం జరిగిందో టీటీడీలో పెద్దలకే తెలియాలి. అయితే ఏం జరిగినా బాధ్యులు..మాత్రం కాంట్రాక్టర్, టీటీడీలోని పెద్దలే . వారు వైసీపీ నేతలు అయినప్పటికీ.. బాధ్యత వారికే వ్యక్తిగంగా ఉంటుంది. కానీ ఈ వివాదాన్ని వైసీపీ మీదకు వచ్చేలా చేయడంలో వారి వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. లడ్డూ కల్తీ జరిగినట్లుగా తేలి ఉంటే అది ఖచ్చితంగా కాంట్రాక్టర్ తప్పిదమేనని.. అలాంటి వారికి అతి తక్కువ ధరకు కాంట్రాక్ట్ ఇచ్చిన పర్చేజింగ్ కమిటీదో.. లేకపోతే టీటీడీ పెద్దలదో అయి ఉంటుంది. ఇక్కడ పార్టీల ప్రస్తావన రాదు. కానీ వచ్చేలా చేయడానికి టీడీపీ, జనేసన చాలా సింపుల్ ట్రాప్ వేశారు. ఆ ట్రాప్ లో వైసీపీ, జగన్ పడిపోయారు. పలితంగా.. తిరుమలలో తప్పు జరిగిందని భావిస్తున్న ప్రతి ఒక్కరూ జగన్ వైపే చూస్తున్నారు. వైసీపీకి చాలా మంది రాజకీయల సలహాదారులు ఉన్నారు. అయితే వీరంతా లడ్డూ కల్తీ ఆరోపణల విషయంలో చంద్రబాబు చేసిన రాజకీయ వ్యాఖ్యల వ్యూహం ఏమిటో అర్థం చేసుకోలేకపోయారు. రాజకీయాల్లో ఆవేశం కంటే ఆలోచన ముఖ్యం. కానీ వైసీపీ ఆవేశంగా స్పందించింది. లాజికల్ గా వివరణ ఇవ్వడానికన్నా ఎదురుదాడి చేయడానికి ప్రాధాన్యం ఇచ్చింది. ఫలితంగా ఈ వివాదం వైల్డ్ ఫైర్ లా అంటుకుంది. ఇప్పుడు విచారణ జరగడం ఖాయం. అందులో కల్తీ కూడా తేలడం ఖాయం. ఇతర విషయాలు కూడా బయటకు వస్తాయి. ఇప్పటికే దర్శనాల బ్లాక్ మార్కెటింగ్ పై ప్రచారం జరుగుతోంది. ఇలా వచ్చే ప్రతి అంశాన్ని ఇక వైసీపీకి, జగన్ కే ముడిపెడతారు. వైసీపీ సమాధానాలు చెప్పుకుంటూ ఉండాల్సిందే. ఎందుకంటే ఇప్పటికే ట్రాప్‌లో ఇరుక్కుపోయారు. లడ్డూ వివాదాన్ని తమపై వేసేసుకున్నారు. ఇక జరగబోయే రాజకీయంలో సర్వైవల్ స్టెప్స్ తెలివిగా వేయాల్సి ఉంటుంది.

## ఆ...ధర్మారెడ్డి ఎక్కడ

తిరుమల, సెప్టెంబర్ 25, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డులో వాడిన నెయ్యిలో కల్తీ జరిగిందని.. అందులో జంతువుల కొవ్వుల తాలూకు అవశేషాలు ఉన్నాయని కూటమి ప్రభుత్వం చేసిన ఆరోపణలు, బయటపెట్టిన ల్యాబ్ రిపోర్టులు ఎంత సంచలనం రేపుతున్నాయో తెలిసిందే. నాలుగైదు రోజులుగా దేశవ్యాప్తంగా ఈ అంశం చర్చనీయాంశం అవుతోంది. జాతీయ మీడియా సైతం ఈ విషయం మీద చర్చలు పెట్టింది.తిరుమల శ్రీవారిని దేశవ్యాప్తంగా కొలిచే భక్తులు ఈ విషయమై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహా వైసీపీ నేతలు ఈ విషయమై ఎదురు దాడి చేసే ప్రయత్నం చేసినా వారి వాదన తర్కానికి నిలవడం లేదు. రోజు రోజుకూ ఈ ఇష్యూలో వైసీపీ ఇమేజ్ డ్యామేజ్ అవుతోంది. ఐతే వైసీపీని ఇంతగా ఇబ్బందిపెడుతున్న అంశం మీద అసలైన బాధ్యుడు స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.గత ఐదేళ్లు టీటీడీ ఛైర్మన్లుగా ఉన్న వైసీపీ నేతలను మించి కొండ మీద ఎక్కువ ఆధిపత్యం చలాయించింది జగన్‌కు అత్యంత ఇష్టుడైన ధర్మారెడ్డి. టీటీడీ జేఈవో పదవిలో ఆయన అంతులేని అధికారాన్ని అనుభవించారు. కొండ మీద అన్నీ ఆయన కనుసల్లోనే జరిగేవి. జగన్ ధర్మారెడ్డికి ఎక్కడలేని ప్రాధాన్యం ఇచ్చేవారు. పదవీ కాలం ముగిశాక కూడా కొనసాగించడానికే చూశారు. అలాంటి వ్యక్తి తాను చక్రం తిప్పిన రోజుల్లో జరిగిన తప్పుల గురించి వస్తున్న ఆరోపణల మీద ఏమీ స్పందించకుండా సైలెంట్‌గా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది.ఒకవేళ వైసీపీ హయాంలో నెయ్యి కల్తీ జరిగి, లడ్డు నాణ్యత దెబ్బ తినడం వాస్తవం అయితే.. అందుకు బాధ్యత వహించాల్సిన వ్యక్తుల్లో ధర్మారెడ్డి కూడా ఒకరు. తనకు జగన్ అంతగా ప్రాధాన్యం ఇచ్చినపుడు.. ఇప్పుడు ఆయనతో పాటు పార్టీకి ఇంత డ్యామేజ్ జరుగుతుంటే కనీసం ఈ ఆరోపణలను ఆయన ఖండించకపోవడం, వివరణ ఇవ్వకపోవడం విడ్డూరం. మరి ధర్మారెడ్డి ఎప్పుడు బయటికి వచ్చి ఈ విషయం మీద మాట్లాడతారో చూడాలి.

# వైద్య విద్యార్థినికి ఎంపీ సన్మానం...





విభారె న్యూస్ సెప్టెంబర్ 25 ఎమ్మిగనూరు..ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగండ్ల మండలం పిల్లిగుండ్ల గ్రామంలో ఎంబిబిఎస్ సీటు సాధించిన కురువ విజయలక్ష్మి ని ఎమ్మిగనూరులో మంగళవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో అదీ కురువ కుటుంబం లో ఎంబిబిఎస్ సీటు సాధించడం అందరికి గర్వకారణమన్నారు. ఇక నుండి విజయలక్ష్మి చదువు విషయంలో తనవంతుగా అండగా ఉంటానని,ఏ అవసరం వచ్చిన తనని సంప్రదించాలని కుటుంబసభ్యులకు ఎంపీ ఫోన్ నెంబర్ ఇచ్చారు. అనంతరం విద్యార్థి తల్లిదండ్రులు లలిత, జనార్దన, మేనమామ బోడబండ నరసింహులును అభినందించారు. కార్యక్రమంలో ఆపిల్ ల్యాబ్ అధినేత భీరప్ప పాల్గొన్నారు.

# జిల్లా రవాణా శాఖ అధికారిగా ఐశ్వర్య రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 25 – :నంద్యాల జిల్లా రవాణా శాఖ అధికారిగా ఐశ్వర్య రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లా రవాణా శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఐశ్వర్య రెడ్డి. జిల్లా రవాణా శాఖ అధికారికి పుష్ప గుచ్చమ్ అందించి స్వాగతం పలికిన సీనియర్ మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ శ్రీకాంత్ విజయవాడలో రవాణా శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఐశ్వర్య రెడ్డి సాధారణ బదిలీలో భాగంగా నంద్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. రవాణా శాఖ సిబ్బంది తదతరులు అభినందించారు.

# పారిశుధ్య నిర్వహణపై తనిఖీలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 25 – పారిశుధ్య నిర్వహణపై తనిఖీలు నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి . బుధవారం పట్టణంలో పలు కాలనీల్లో తనిఖీలు చేశారు. అక్కడ జరుగుతున్న శానిటేషన్ పనులను డ్రైనేజీ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కాలువల్లో వ్యర్థాలు చెత్త చెదారం వేయడం వల్ల మురికి కాలువలు నిండి పోతున్నాయని ఆయన అన్నారు. ప్రజలు చెత్త చెదారం కాల్వల్లో వేయడం మానుకోవాలని సూచించారు. కమిషనర్ వెంట . అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. మురళీధర్ . సచివాలయ సిబ్బంది. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు

# సూపర్ సిక్స్ పథకాలను తుంగలో తొక్కిన చంద్రబాబు

## థాలి బజావో తో నిరసన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పి మురళీకృష్ణ






విభారే న్యూస్. ఆగస్టు 25. కర్నూల్ ప్రతినిధి సూపర్ సిక్స్ పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తుంగలో తొక్కారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే టిటిడి బోర్డు మాజీ సభ్యులు పరిగెల మురళీకృష్ణ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదురుగా జరిగిన థాలి బజావో కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పి మురళీకృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు 100 రోజులైనా అమలు చేయకపోవడం తెలుగుదేశం కూటమి ప్రభుత్వం చేతగాని తనానికి నిదర్శనమని నిద్రపోతున్న ప్రభుత్వాన్ని మేల్కొల్పడం కోసం వారు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ ప్లేట్లు, గరిటెలతో కర్నూలు జిల్లా కలెక్టరేట్ దగ్గర శబ్దాలు చేస్తూ నిరసన తెలుపుతున్నామని, ఎన్నికల మేనిఫెస్టోలో బిసి, యస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే ఫించన్ ఇస్తామని మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చారని జులై, ఆగష్టు, సెప్టెంబర్ 3 మాసాలయినా అమలు కాలేదని ఎద్దేవ చేశారు. నిరుద్యోగ యువతకు నెలకు3వేలరూపాయలునిరుద్యోగభృతిఇస్తామన్నారని ఇప్పటి వరకు అమలు కాలేదని, తల్లికి వందనం పథకం క్రింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ15,000 లు ఇస్తామన్నారని ఇవ్వలేదనీ, అన్నదాత సుఖీభవ పథకం క్రింద ప్రతి రైతుకు ఏటా రు 20,000 లు ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారని ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుకుందని ఇంతవరకు ఆర్థిక సహాయం చేయలేదని 19 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ 1500 ఇస్తామన్నారని ఇవ్వలేదని, ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తామన్నారని చేయలేదని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు కాలేదని పైన పేర్కొన్న సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాలు శాశ్వతం కాదని ఇచ్చిన హామీలు నెరవేర్చాలని లేదంటే కేంద్రంలో రాహుల్ గాంధీ గారు, రాష్ట్రంలో వైఎస్ షర్మిల రెడ్డి గారి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి అమలు అయ్యేవరకు పోరాడుతుందని మురళీకృష్ణ గారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముందుగా కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నాయకులు, కార్యకర్తలు ప్లేట్లు, గరిటెలు చేతబట్టి శబ్దాలు చేస్తూ తెలుగుదేశం బిజెపి జనసేన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర బాబు, కర్నూల్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష, నియోజకవర్గ ఇన్చార్జీలు ఎం ఖాసిం వలి, రమేష్ యాదవ్, చిప్పగిరి లక్ష్మీనారాయణ, మురళీ కృష్ణంరాజు, కాంగ్రెస్ నాయకులు పీజీ నరసింహులు యాదవ్, దామోదరం రాధాకృష్ణ, ఎన్ సి బజారన్న, కే వెంకటరెడ్డి, పోతుల శేఖర్, పీజీ ప్రదీప్ యాదవ్, కే రాఘవేందర్ రెడ్డి, ఎస్ ప్రమీల,ఏ వెంకట సుజాత రియాజుద్దీన్, షేక్ మాలిక్ భాష, ఎజాస్ అహ్మద్, అనంతరత్నం, ఈ లాజరస్, సయ్యద్ నవీద్, పెద్దకడబూరునరసింహులు,డబ్ల్యూ సత్యరాజు,బి సుబ్రహ్మణ్యం,వెల్దుర్తి శేషయ్య,అబ్దుల్ హై, జాన్ సదానందం, ఆదోని మారుతీరావు,దిలీప్ దోకా,సాయినాథ్, శ్రీనిద్, చిప్పగిరి వినోద్ కుమార్, అభి నాయుడు, ఐఎన్టియుసి నాయకులు ఎన్ సుంకన్న,ఆర్ ప్రతాప్,ఆనందం, జేమ్స్, గోవిందు, జయరాముడు కాంగ్రెస్ నాయకులు ప్రతాపరెడ్డి తిప్పన్న నాయుడు రమేష్ అక్బర్మహిళాకాంగ్రెస్ కె వెంకటలక్ష్మి సావిత్రి సంజమ్మ మొదలగువారు అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి... - జిల్లా ఎస్పీ బిందు మాధవ్...



విభారె న్యూస్ సెప్టెంబర్ 25 కర్నూలు జిల్లా ప్రతినిధి..కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకునే విధంగా, బాధ్యతయుతమైన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలి.జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ తెలిపారు.కర్నూలు లోని కళాశాలల యాజమాన్యాలు, కళాశాలల ప్రిన్సిపాల్స్,హెచ్ ఓ డి లతో కలిసి సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ.సైబర్ నేరాలు,రోడ్డు భద్రతనిబంధనలపైవిద్యార్థులకుఅవగాహన కల్పించాలి.ఈవ్ టీజింగ్,యాంటీ ర్యాగింగ్, మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాల గురించి యాజమాన్యాలు విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలి.బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో కర్నూలులోనీ ఆయా ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యా లు, కళాశాలల ప్రిన్సిపాల్స్,హెచ్ ఓ డి లు,అధ్యాపకులతో కలిసి జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ సమావేశం నిర్వహించారు.పలు సూచనలు,సలహాలు చేశారు.ఈ సంధర్బంగా జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపియస్ మాట్లాడుతూ...యాంటీ ర్యాగింగ్,ఈవ్ టీజింగ్,మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాల పై, సోషల్ మీడియా,రోడ్డు భద్రత,సైబర్ నేరాల పట్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకునే విధంగా తీర్చిదిద్దాలన్నారు .బాధ్యతయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు.ఈవ్ టీజింగ్,ర్యాగింగ్ అనేవి నేరమని, ఎవరైనా తోటి విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలుంటాయని భవిష్యత్తు కోల్పోతారని తెలియజేయాలన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు యువత ధైర్యంతో ఎదుర్కొవాలే తప్ప ఆత్మహత్య అనేది సమస్యలకు పరిష్కారం కాదని తెలియజేయాలన్నారు. మాదకద్రవ్యాల బారినపడి విద్యార్దులు జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్దులకు తెలియజేయాలన్నారు. మాదక ద్రవ్యాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైనా క్రయ,విక్రయాలు జరిపినా లేదా సేవించినా డయల్ 100 కు కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అతిగా సెల్ ఫోన్ వినియోగం,సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, వాట్సాప్,ఇంస్టాగ్రామ్ లాంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.సోషల్ మీడియా వేధింపుల పై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అనవసర లింకులు షేర్ చేయకూడదని,తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్,లోన్ యాప్ లు, ఇన్వెస్ట్మెంట్లు,ఏ పి కె ఫైల్స్ ,బెట్టింగ్ యాప్స్ లాంటి వాటితో మోసపోకూడదని విద్యార్దులకు తెలియజేయాలన్నారు. సైబర్ నేరాలకు గురి అయితే వెంటనే 1930 కి సమాచారం అందించి, సైబర్ క్రైమ్ పోర్టల్ లో http://www.cybercrime.gov.in/ ఫిర్యాదు చేయాలని విద్యార్దులకు అవగాహన కల్పించాలన్నారు.సైబర్ నేరాలను అదుపు చేయాలంటే ఒక్క పోలీసు వ్యవస్థతోనే సాధ్యం కాదని,ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కర్నూలులోని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, హెచ్ ఓ డి లు,అధ్యాపకులు,స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్,స్పెషల్ బ్రాంచ్ ఎస్సై ఖాజావలి పాల్గొన్నారు.

# ప్రజాభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 25 – ప్రజల సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. బుధవారం నంద్యాల నియోజకవర్గంలోని అయ్యలూరు మెట్ట గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం – ప్రజా వేదిక కార్యక్రమంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు అయిన సందర్భంగా అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు స్వర్ణాంధ్ర 2047 పేరుతో పకడ్బందీ ప్రణాళిక రూపొందిస్తోందన్నారు. అమరావతిలో వరదలు వచ్చి ప్రజలు ఇబ్బందుల్లో వున్నప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా వరద బాధితులకు అండగా నిలబడి ఒక తండ్రిలా ప్రజల్ని కాపాడారని గుర్తు చేశారు. గత ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను తు.చ తప్పకుండా అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం అండగా ఉండి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి తెలిపారు. ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉన్నంతవరకు రాష్ట్రంలో ఆదర్శ పాలన కొనసాగుతుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు ఆంధ్ర రాష్ట్రం ఏమాత్రం తీసిపోకుండా అభివృద్ధి దిశలో పయనించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విజయవాడలో ఇటీవల సంభవించిన వరదల కారణంగా నిరాశ్రయులైన బాధితులను ఆదుకునేందుకు అనేకమంది ముందుకు వచ్చి సీఎం సహాయనిధికి విరాళాలు ఇస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజులలో చేపట్టిన కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. స్వర్ణాంధ్రఏ2047 దార్శనిక పత్ర రూపకల్పనలో భాగంగా క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తున్నామని ప్రజలందరూ సహకరించి అభివృద్ధి ప్రణాళికలో భాగస్వాములు కావాలని ఆమె సూచించారు. ఇది మంచి ప్రభుత్వంలో భాగంగా స్వర్ణాంధ్ర కరపత్రాలు, స్టిక్కర్లను ప్రతి ఇంటికి సచివాలయాల సిబ్బంది ద్వారా చేరవేస్తున్నామన్నారు. అంతకుముందు మంత్రి, జిల్లా కలెక్టర్ కు గ్రామస్తులు డప్పు, వాయిద్యాలతో అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం అయ్యలూరు మెట్ట ప్రాంత నివాసి కొమ్ము రమణారెడ్డి వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి 15,000 రూపాయల నగదు మొత్తాన్ని మంత్రికి అందజేశారు. పిదప రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్ గ్రామంలోని వీధుల్లో పర్యటిస్తూ ఇది మంచి ప్రభుత్వ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్డీవో మల్లికార్జున రెడ్డి, తహశీల్దార్ ప్రియదర్శిని, ఎంపీడీవో సుగుణశ్రీ, అధికారులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190